క్లుప్తంగా

కడప డివిజన్ ఏడీఏగా లక్ష్మి మాధవి



ఏవోల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మి మాధవి

కడప అగ్రికల్చర్: కడప డివిజన్ ఏడీఏ(సహాయ వ్యవసాయ సంచాలకులు)గా గురువారం బి. లక్ష్మిమాధవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె కడప కార్యాలయ ఆవరణంలో ఖాజీపేట, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, కడప, సికెదిన్నె, కడప మండల వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎకరా వరిపంట మొత్తానికి 75 కేజీలు యూరియా సరిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు సురేష్‌కుమార్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగార్చన, శ్రీదేవి, మంజులతోపాటు గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూ

కడప ఎడ్యుకేషన్: కడపలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్సు సబ్జెక్టు బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 12వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలోని కంప్యూటర్ సైన్సు డిపార్టుమెంట్‌కు హాజరు కావాలని తెలిపారు. ఎంఎస్సీ కంప్యూటర్ సైన్సు, ఎంసిఏ, ఎంటెక్ కంప్యూటర్ సైన్సులో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. నెట్, సెట్, పిహెచ్‌డి అర్హత కలిగిన వారికి ప్రాధన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

రాజీవ్ మార్గ్‌లోని వైన్ షాపును రద్దు చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని రాజీవ్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన వైన్‌షాపును రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి వై. శ్రీరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడ చూసినా మద్యం షాపులు, బార్లే కనిపిస్తున్నాయని, విచ్చలవిడిగా వాటికి లైసెన్సులు ఇస్తున్నారన్నారు. చిన్న గ్రామాల్లో సైతం బెల్టుషాపులు వెలుస్తున్నాయన్నారు. గుడులు, బడుల వద్ద వైన్‌షాపులు ఏర్పాటు చేయకూడదని నిబంధనలున్నా వాటిని ఏమాత్రం లెక్క చేయకుండా వైన్‌షాపులు ఏర్పాటు చేస్తున్నారని, రూ.5లక్షలు చెల్లిస్తే పర్మిట్ రూములకు కూడా అనుమతి ఇస్తున్నారన్నారు. తాజాగా రాజీవ్ మార్గ్‌లో వైన్‌షాపు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ మార్గంలో ఉదయం, సాయంత్ర వేళల్లో మహిళలు, సీనియర్ సిటిజన్లు, పిల్లలు, యువత వాకింగ్ చేస్తుంటారని, ఆహ్లాదకర వాతావరణంలో విశ్రాంతి తీసుకుంటూ ఉంటారన్నారు. అలాంటి వాతావరణాన్ని అధికార పార్టీ నేతలు చెడగొట్టాలని చూస్తున్నారని, పక్కనే పాఠశాలలు ఉన్నా లెక్క చేయకుండా వైన్ షాపు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. మందుబాబుల వల్ల మహిళలు, యువతులు ఇబ్బందులు ఏర్పడే అవకాశముందని, పోలీస్, ఎక్సైజ్ అధికారులు ఈ దిశగా ఆలోచన చేసి దీన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.

మహిళపై దాడి

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దేవునికడప ప్రాంతంలో నివాసం వుంటున్న భారతి అనే మహిళ వద్ద సుదర్శన్ రాయల్ అనే వ్యక్తి తన అవసరాలకు డబ్బులను అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బులను అడిగేందుకు వెళ్లగా ఆమెపై సుదర్శన్ రాయల్ దాడి చేసినట్లు బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి తెలియజేశారు.

దుకాణంలో చోరీ

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు రాజీవ్ పార్క్ సమీపంలో వున్న రామలింగారెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన చిల్లర అంగడిలో బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో రూ. 14వేలు విలువైన వివిధ రకాల కంపెనీలకు సంబంధించిన సిగరెట్లు చోరీ అయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్‌నాథ్ రెడ్డి తెలియజేశారు.

విజ్ఞాన్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: విజ్ఞాన్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళనను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం వల్లూరు మండల పరిధిలో విజ్ఞాన్ స్కూల్ బస్సు రైల్వే బ్రిడ్జ్ వద్ద బోల్తా పడిందని ఈ ఘటనలో అందులో ఉన్న పిల్లలు గాయపడ్డారన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జలమయం



కడప రిమ్స్ ఆవరణలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద వాన నీరు నిల్వ ఉంటోంది. వర్షపు నీరు వెళ్లాల్సిన కాలువ పూడ్చివేసి మట్టి వేయడంతో ఈ సమస్య వచ్చిందని, ఇందులో పారిశుధ్య అధికారుల నిర్లక్ష్యం ఉందని పలువురు విమర్శిస్తున్నారు. రోగులు, వైద్యులు ఆ దారిన వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కడప



వానొస్తే ఇంతే..



కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని 48వ డివిజన్ పరిధిలోని రామరాజుపల్లె, హోమియోపతి కళాశాలకు వెళ్ళేదారిలో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్లపై నిలిచిన నీరు వెళ్ళేందుకు మార్గం లేకపోవడంతో ఎక్కడినీరు అక్కడ నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా నంద్యాల నాగిరెడ్డి కాలనీ, ఆచారి కాలనీకి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నామని... ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షపు నీటి సమస్యను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: కడపలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వర్షపు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. గురువారం (పిఆర్ఎస్ వైఎఫ్) ఆధ్వర్యంలో ఐటిఐ కళాశాలలో చేరిన వర్షపు నీటిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో చిన్నపాటి వర్షం వచ్చిన కళాశాల ప్రాంగణం వర్షపు నీటితో నిండిపోతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. తద్వారా అక్కడ చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ నగర నాయకులు గోపీచంద్, ఆజాద్, రాహుల్ పాల్గొన్నారు.



ఐటీఐలో నిలిచిన వర్షపు నీటిని చూపుతున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

జూనియర్, డిగ్రీ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు డిమాండ్ చేశారు. కడపలోని జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రాంతీయ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయక పోవడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఇంటర్ విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్స్‌కు ప్రమోషన్లలో అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, శ్రీనువాసులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: లేఔట్ రెగ్యులైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి సూచించారు. గురువారం మార్నింగ్ విజిట్ లో భాగంగా సౌత్ జోన్‌లో ఆయన పర్యటించారు. దస్తగిరి పేటలో ఉన్న లే ఔట్‌ను సందర్శించి అందులోని సదుపాయాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా రెగ్యులరైజేషన్ చేసుకోవాలని వారికి తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. ప్రైవేటు ట్రాక్టర్ల పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో ట్రాక్టర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. 23వ డివిజన్‌లో మెయిన్ రోడ్లలో చెత్త కుప్పలను సకాలంలో తొలగించాలని, ప్రతి ఇంటి నుంచి చెత్తను ప్రతిరోజూ సేకరించాలని అధికారులను ఆదేశించారు.

ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ దళితమిత్ర సంఘం అధ్యక్షులు కె.రామాంజనేయులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని ఏపీ దళితమిత్ర సంఘం అధ్యక్షులు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని ఆ సంఘ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఇతర ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగాల కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఊసే లేదని విమర్శించారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత యువత కోసం ప్రత్యేక స్టార్టప్ పథకాలు తీసుకు రావాలని కోరారు. పరిశ్రమల్లో ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించాలన్నారు. యువత ఉపాధి, ఆర్థిక స్వావలంబన కోసం స్వయం ఉపాధి ప్రోత్సాహకాలు కల్పించాలన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నేరుగా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మురహరి ప్రవీణ్ కుమార్, నగర అధ్యక్షుడు కె.ప్రసాద్, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, సాయి పవన్‌కుమార్, దేవాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శం



ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నేటి తరానికి సీతారాం ఏచూరి జీవితం ఆదర్శమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని రామకృష్ణ నగర్‌లో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల కోసం అనునిత్యం పోరాడిన గొప్ప మహనీయుడు సీతారాం ఏచూరి అని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, కెవిపిఎస్ కడప నగర కన్వీనర్ నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు జార్జి, మహిళా సంఘం నాయకురాలు కామేశ్వరమ్మ, సిఐటియు నాయకులు గోవిందు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వరలక్ష్మి ,నగర కన్వీనర్ సి పి రమణ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా విద్యాసంస్థకు ఎక్స్‌లెన్స్ అవార్డు



ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాయిసుధీర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప సాయిబాబా విద్యాసంస్థకు న్యూ ఢిల్లీలో వివాంటా(ద్వారకా) 7 స్టార్ హోటల్‌లో సి- ఫోర్ స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేశారు. ఇందులో ఇండియాలో బెస్ట్ బడ్జెట్ స్కూల్స్‌లో సాయిబాబా హైస్కూల్ 12వ ర్యాంకు సాధించడం విశేషం. ఈ అవార్డును డాక్టర్ కార్తికేయన్(సిబిఐ డైరెక్టర్) కె. శివ ప్రసాద్(ఐఎఎస్) చేతుల మీదుగా సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మెన్ యం వి సాయి సుధీర్‌కుమార్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా సాయి సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సి- ఫోర్ సంస్థ వారు తమ పాఠశాలకు 12వ స్థానం కేటాయించడం మాకు చాలా గర్వకారణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్స్‌లో ఇండియాలో 12వ ర్యాంకు రావడం చాలా సంతోషమన్నారు.

ఘన సన్మానం



బదిలీపై వెళుతున్న శ్రీనివాసరావును ఘనంగా సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్: ఏఆర్ డీఎస్పీ గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల పదోన్నతి పొంది ఏఆర్ అదనపు ఎస్పీ గా ప్రకాశం జిల్లా కు వెళ్లిన శ్రీనివాస రావుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ మాట్లాడుతూ శ్రీనివాస రావు సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందచేశారు. సన్మాన గ్రహీత, ప్రకాశం జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ గా పదోన్నతి పై వెళ్తున్న కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ అందించిన ప్రోత్సాహం, సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య, ఆర్ఐ లు శివరాముడు, వీరేష్, శ్రీశైల రెడ్డి, టైటస్, సోమశేఖర్, ఆర్.ఎస్.ఐ లు వెంకటేశ్వర్లు, స్వామి నాయక్, వర్మ, రామస్వామిరాజు, అప్పలనాయుడు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



డ్రగ్స్ అనర్థాలపై వివరిస్తున్న కడప ఒన్‌టౌన్ పోలీసులు, సిబ్బంది

కడప అర్బన్: కడప నగరం రాధాకృష్ణ నగర్ లోని బాలుర సోషల్ వెల్ఫేర్ హాస్టల్ నెంబర్- 3 విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా 'ఈగల్'బృందం 'నార్కోటిక్' బృందం స్థానిక 1 టౌన్ పోలీసు అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ తమ పాత్ర పోషించాలని అధికారులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ సమీప ప్రాంతాల్లో ఎక్కడైనా డ్రగ్స్ దుర్వినియోగం జరుగుతున్నట్లు మీకు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి కాల్ చేసి వివరాలు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రమేష్ బాబు , 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రతాపరెడ్డి , సిబ్బంది, నార్కోటిక్ సెల్ నుండి ఏఎస్ఐ మల్లయ్య, ఈగల్ బృందం సభ్యులు అయూబ్ ఖాన్, గురు శేఖర్ పాల్గొన్నారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపమా నందజీ



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కడప ఎడ్యుకేషన్: స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళితే విద్యార్థులు వారి ఆశయాలను సాధించడంతో పాటూ దేశ భవిష్యత్తును నిర్మించవచ్చని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపమా నందజీ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాలు విభాగం లో జరిగిన యూనివర్సల్ బ్రదర్హుడ్ డే(సార్వత్రిక సోదరుల దినోత్సవం) కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గా హాజరైన రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపమా నందజీ మాట్లాడుతూ స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11వ తేదీన ప్రపంచ మతాల పార్లమెంటులో మన దేశ సంస్కృతి గురించి మాట్లాడిన సందర్భంగా యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే ని ప్రతి సంవత్సరం ప్రపంచం మొత్తం నిర్వహించుకుంటోందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన వైవీయూ కులసచివులు ప్రొఫెసర్ పి పద్మ మాట్లాడుతూ యువత వివేకానంద స్వామి ని స్ఫూర్తిగా తీసుకొని మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించుకొనుటకు కృషి చేయాలని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన బి శివరామిరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద చికాగో సభకు హాజరైన విధానం, ప్రసంగం గురించి గుర్తు చేశారు. వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగ అధిపతి డాక్టర్ కే రామ సుబ్బారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైవీయూ టీచింగ్, నాన్ టీచింగ్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

కడపలో 'దిగ్విజయ్ దివస్'

కడప కోటిరెడ్డిసర్కిల్ : చికాగోలో 'స్వామి వివేకానంద' చేసిన చారిత్రాత్మక ప్రసంగానికి నేటికి 132సంవత్సరాలు పూర్తయిన నేపధ్యంలో గురువారం కడపలో బీజేవైఎం ఆధ్వర్యంలో దిగ్విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం నేతలు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ నాయుడు, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సురేంద్ర, శివనాయక్, ఓబులేసు, శ్రీకాంత్ , సాయి ఈశ్వర్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అరియర్ బిల్లుల చెల్లింపు గడువు పొడిగించాలి



ఖజానా ఉప సంచాలకులకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన అరియర్ బిల్లులను ఖజానాకు సమర్పించుటకు గడువు పొడిగించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. గురువారం జిల్లా ఖజాన కార్యాలయంలో ఉప సంచాలకులు వెంకటేశ్వర్లును వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ అరియర్ బిల్లులు సమర్పించుటకు ప్రతి నెల 6వ తేదీ నుండి 10వ తేదీ వరకు గడువు ఉండేదని అయితే ఈ నెల కొన్ని అనివార్య కారణాల వల్ల 8వ తేదీ నుండి 15వ తేదీ వరకు గడువు పొడిగిస్తామని చెప్పినప్పటికీ పదవ తేదీ తోనే ఆన్‌లైన్‌లో గడువు ముగిసినట్లుగా చూపుతున్నారని తెలిపారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఉద్యోగులు అరియర్ బిల్లులు సమర్పించలేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కావున బిల్లులు సమర్పించుటకు 15వ తేదీ వరకు గడువును పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి కష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగకు ఐఆర్ ప్రకటించాలి



జయనగర్ కాలనీ హైస్కూల్లో టీచర్లు నుంచి సభ్యత్వ నమోదును స్వీకరిస్తున్న ఎస్టీయూ నేతలు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఐఆర్‌ను దసరా పండగకంతా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషలు డిమాండ్ చేశారు. కడపలోని జయనగర్ కాలనీ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సమస్యల సేకరణ..సభ్యత స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దసరా పండుగకు ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటి వరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం రెండు డీఏలు అయినా దసరా పండుగకు ప్రకటించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా కూడా ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలు అలాగే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించక పోవడం చాలా బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రమణారెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ జేఏసీ నాయకులు

కడప కార్పొరేషన్: కడప మున్సిపల్ కార్పొరేషన్ వార్డు సచివాలయం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో న్యాయం జరగక పోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని కడప గ్రామ, వార్డు సచివాలయాల జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి ముందస్తుగా వినతి పత్రం సమర్పించారు. కడప కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయం కార్యదర్శులు అందరూ రాష్ట్ర గ్రామ, వార్డు రాష్ట్ర ఉద్యోగుల జేఏసీకి అనుబంధంగా, ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలు, వాలంటీర్ డ్యూటీలైన సర్వేల వలన ఇబ్బందులను పరిష్కరించుకోవాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతులు వంటి సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సమస్యల పరిష్కారం చేయని పక్షంలో, రాష్ట్ర గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగుల జేఏసీతో కలిసి కడప గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగులు అందరూ తదుపరి కార్యాచరణ ప్రకారం నిరసన కార్యక్రమాలు చేపడుతామని, ఆ దిశగా ముందుకు వెళ్తామని సమ్మె నోటీసు ద్వారా తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ఆర్ఎస్ఎఫ్ ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఉమ్మడి జిల్లాలోని ఆర్‌సీఎం పాఠశాలల యాజమాన్యం ఆర్‌జేడీ, డీఈఓ, ఎంఈఓలు కుమ్మక్కై... కూడబలుక్కొని ఎయిడెడ్ పోస్టుల భర్తీలో రూ. 25 కోట్ల కుంభ కోణానికి పాల్పడ్డారని, దీనిపై విచారణ నిర్వహించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఓబులేశు యాదవ్ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికిగాను పోస్టుల భర్తీకి అనుమతులు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. అయితే రోస్టర్ పాయింట్స్, రూల్ ఆఫ్ రిజర్వేషన్స్‌లను తుంగలో తొక్కారన్నారు. తప్పుడు కుల ధృవీకరణ పత్రాలతో ఒక్కొక్క పోస్టుకు రూ. 35 లక్షలు చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. అప్పటి ఆర్‌జేడీ రాఘవరెడ్డి, శ్యామూల్, డీఈఓ అనూరాధ, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఆర్‌సీఎం యాజమాన్యంతో కుమ్మక్కై వాటాలు పంచుకున్నారని ఆరోపించారు. ఈ అంశంపై కలెక్టర్ విచారణ చేయించి కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నగర నాయకులు కార్తీక్, నిర్మల్, ఆసిఫ్, రమేష్, చంద్ర, వంశీ, చిన్నకేశవులు, శివ తదితరులు పాల్గొన్నారు.